RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | మంగళవారం 6-10-2026 | సంచిక: 13 | సంఖ్య: 348 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి






## సీఈసీకి సుప్రీం కోర్టు నోటీసులు

**సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం విచారణ**

- కేంద్ర ప్రభుత్వం, ఈసీకి వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులు
- ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాల్లో సీఈసీ ఒంటరిగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణ
- చట్టవిరుద్ధమైన నిర్ణయాలు ఉంటే రద్దు చేస్తామన్న సుప్రీంకోర్టు ధర్మాసనం
- సీఈసీ విధులకు ఆటంకం కలిగించేలా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరణ

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ అధికారాల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు నేడు విచారణ చేపట్టింది. ఇతర కమిషనర్లతో సంప్రదించకుండా సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లను స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో

- మిగతా 2వ పేజీలో



## మా అనుమతి లేదు'.. ఫారమ్-6పై సుప్రీంకోర్టు

- మార్పు ఎవరు చేశారో తెలుసుకుంటామన్న సీజేఐ
- రికార్డులు చూశాకే పూర్తిస్థాయి విచారణ ఉంటుందని వెల్లడి
- ఫారమ్-6ను సవరించలేదని ఈసీ స్పష్టీకరణ
- 'సర్' కోసం అదనపు డిక్లరేషన్ మాత్రమే చేర్చామని వెల్లడి

2లో

# రేవంత్ రెడ్డి సర్కార్ మరో అడుగు..

## 2027లో 67 యంగ్ ఇండియా స్కూళ్లు



- 119 నియోజకవర్గాల్లో దశలవారీగా యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటు
- డిసెంబర్ 2027లోపు 67 క్యాంపస్‌లు పూర్తి చేయాలని ఆదేశాలు
- జూన్ 2028 నాటికి మరో 20 స్కూళ్లను పూర్తి చేసేలా ప్రణాళిక
- ఫ్యూచర్ సిటీలో ఆరు విదేశీ వర్సిటీలకు క్యాంపస్‌లపై ఆసక్తి

హైదరాబాద్, అక్టోబరు 5: తెలంగాణలో విద్యా మౌలిక వసతులపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణంపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టు పనుల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం సచివాలయంలో సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా



## తెలంగాణలో ఓట్ల లెక్కపై దుమారం..

### మహేశ్ గౌడ్ సంచలన ఆరోపణలు..

### అక్టోబర్ 8న కాంగ్రెస్ భారీ ఆందోళన

- ఓటర్ల జాబితాపై కాంగ్రెస్ యాక్షన్ ప్లాన్.. వరుస నిరసనలకు పిలుపు
- ఢిల్లీలో కాంగ్రెస్ కీలక సమావేశం.. 'సర్'పై ప్రధానంగా చర్చ
- తెలంగాణలో 90 లక్షల ఓట్లు తొలగించారన్న మహేశ్ కుమార్ గౌడ్
- గ్రామాల నుంచి రాష్ట్ర రాజధాని వరకు నిరసనలు చేపట్టాలని నిర్ణయం
- అక్టోబర్ 8న లోక్‌భవన్ వద్ద ఆందోళనకు సిద్ధమైన టీపీసీసీ

## సింగరేణి కార్మికుల కోసం కవిత పోరుబాట..

- కార్మికుల హక్కుల కోసం సింగరేణి భవన్ వద్ద తెలంగాణ రక్షణ సేన నిరసన
- లాభాల్లో 35 శాతం వాటా ఇవ్వాలని కవిత డిమాండ్
- మెడికల్ బోర్డులు నెలకు రెండుసార్లు నిర్వహించాలని విజ్ఞప్తి
- ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.62 వేల కోట్లను విడుదల

## సామాన్యుడిపై ధరల భారం.. ప్రభుత్వం నిద్రమత్తులో ఉందా?

- సన్నబియ్యం ధరలు నాలుగు నెలల్లో 25 శాతం పెరిగాయన్న హరీష్ రావు
- రైతుకు గిట్టుబాటు లేదు.. వినియోగదారుడికి అందుబాటు లేదని విమర్శ
- ఉల్లిపాయ, వెల్లుల్లి, పప్పుల ధరలపై ప్రభుత్వాన్ని నిలదీత
- బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలపై తక్షణ తనిఖీలకు డిమాండ్

2లో



# ఏదుల నుంచే డిండికి నీళ్లు

### ఏదుల నుంచా ? శ్రీశైలం నుంచా?

- ఏదుల నుంచే సరఫరాకి మంత్రి ఉత్తమ్ పట్టు
- శ్రీశైలం నుంచి తీసుకోవాలని సీఎంపై పాలమూరు నేతల ఒత్తిడి
- ఉత్తమ్‌తో సీఎం రేవంత్ సుదీర్ఘ సమీక్ష.. వివరాలు వెల్లడించని సీఎంఓ



హైదరాబాద్: డిండి ఎత్తిపోతల పథకానికి ఎక్కడి నుంచి నీళ్లు తరలించాలనే అంశంపై రాష్ట్ర సర్కారులో తీవ్ర అనిశ్చితి నెలకొంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ఏదుల రిజర్వాయర్ నుంచే డిండి ఎత్తిపోతల పథకానికి సైతం నీటిని తరలించడానికి అనుమతిస్తూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నీటిపారుదల శాఖ జీఓ 10 జారీ చేసింది. ఏదుల రిజర్వాయర్‌లో 436 మీటర్ల నీటిమట్టం నుంచి డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని తరలించడానికి పనులు చేపట్టాలని అప్పట్లో సూచించింది. అయితే దీనిపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజాప్రతినిధుల నుంచి వ్యతిరేకత వ్యక్తం అయింది. డిండికి ఏదుల నుంచి కాకుండా నేరుగా శ్రీశైలం జలాశయం నుంచి నీళ్లను తరలించాలని సీఎంపై నేతలు ఒత్తిడి తెచ్చారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ జిల్లా నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ ప్రభుత్వానికి తాజాగా ప్రతిపాదనలు పంపగా ఆ శాఖ

- మిగతా 2వ పేజీలో



## 5 నిమిషాల్లో రూ. 2 కోట్ల బంగారం లూటీ!

- హైదరాబాద్ శివారులోని ఓ నగల షాపులో అంతర్రాష్ట్ర దొంగల ముఠా 'తెర'చాటు చోరీ
- షట్టర్ పగులగొట్టి అది ఎవరికీ కనిపించకుండా తెల్లని వస్త్రం అడ్డుపెట్టి లోపలకు..
- 1.4 కిలోల నగలు కొల్లగొట్టి ఆటోలో పరారీ.. రాజస్తాన్ ముఠా పనిగా అనుమానం
- సీసీ కెమెరాల్లో రికార్డయిన ఏడుగురి కదలికలు.. నిందితుల కోసం రంగంలోకి ప్రత్యేక బృందాలు

2లో

## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

- రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదని, అభివృద్ధి అని పవన్ కల్యాణ్ వ్యాఖ్య
- ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో అమరజీవి జలధార పథకానికి శ్రీకారం
- గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిందని తీవ్ర విమర్శ
- పులివెందుల, అరకులోనూ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామని వెల్లడి
- ఇది కక్షసాధింపుల ప్రభుత్వం కాదు, ప్రజాభివృద్ధి ప్రభుత్వమని స్పష్టీకరణ

"యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా.

- మిగతా 2వ పేజీలో



## ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు..

- అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థల ఏర్పాటుకు తెలంగాణ కీలక చర్యలు
- ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటుకు ప్రత్యేక పాలసీ
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు
- అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచన



2లో

## మమ్మల్ని ఎవరూ పెళ్లి చేసుకోవడం లేదు



- సీఎం ఎదుట గోడు వెళ్లబోసుకున్న యువ రైతు
- కర్ణాటకలో యువ రైతులకు పెళ్లిళ్లు కావడం లేదంటూ డీకేకు ఫిర్యాదు
- భూమి, ఇల్లు ఉన్నా అమ్మాయిలు ఇష్టపడటం లేదని యువరైతు ఆవేదన
- అమ్మాయిలు ఉద్యోగస్తులే కావాలంటున్నారని ఆరోపణ
- దీన్ని ఆరో గ్యారంటీగా స్వీకరించి పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- ఇది తీవ్రమైన సామాజిక సమస్య అని స్పందించిన డిప్యూటీ సీఎం శివకుమార్

2లో

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# సీఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫారం 6లో మార్పులు వంటి పలు కీలక నిర్ణయాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మిగతా ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా ఏకపక్షంగా తీసుకున్నారని పిటిషనర్లు ఆరోపించారు. ఎన్నికల సంఘం వంటి బహుళ సభ్యుల కమిషన్‌లో నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీ ప్రాతిపదికన జరగాలని, కానీ ఇక్కడ అలా జరగలేదని వారు కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఈసీ తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. “రాజ్యాంగబద్ధమైన సంస్థలు చట్టానికి లోబడి పనిచేయాలి. ఒకవేళ తీసుకున్న నిర్ణయాలు చట్టవిరుద్ధమని తేలితే, వాటిని రద్దు చేస్తాం” అని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే, సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ విధులకు ఆటంకం కలిగించేలా లేదా ఆయనను సస్పెండ్ చేసేలా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి కోర్టు నిరాకరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలను సీఈసీ ఒక్కరే కాకుండా, ముగ్గురు సభ్యుల కమిషన్ సంయుక్తంగా వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు తమ పిటిషన్‌లో కోరారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు నోటీసులతో ఈ వ్యవహారంపై కేంద్రం, ఈసీ ఎలాంటి వివరణ ఇస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

# మా అనుమతి లేదు’.. ఫారమ్-6పై సుప్రీంకోర్టు

కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్-6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరించిన ఫారమ్-6కు తాము అనుమతి ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు. ఫారమ్-6లో అసలు మార్పు జరిగిందా? జరిగితే ఎవరు చేశారు? అనే విషయాలను తేల్చాల్సి ఉందని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాతే అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని సీజేఐ చెప్పారు. “సవరించిన ఫారమ్-6ను మేం ఆమోదించలేదు. ఇది స్పష్టం” అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అయితే ఫారమ్-6ను సవరించలేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) కోసం కొత్త ఓటర్లకు అదనపు డిక్లరేషన్ మాత్రమే జత చేశామని వివరిస్తోంది. ఈ అదనపు ప్రకటనను జులైలో చేర్చారు. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పాత ఓటరు జాబితా వివరాలను అనుసంధానించాల్సి ఉంటుంది. ఫారమ్-6 రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్-1960లో భాగం. ఈ నిబంధనల్లో మార్పులు చేయాలంటే అధికారికంగా సవరణ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు 29న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ఈ అంశాన్ని లేవనెత్తారు. ఫారమ్-6 మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ప్రతిపాదన తమ వద్ద లేదని న్యాయశాఖ ఆర్టీఐ సమాధానంలో చెప్పినట్లు ఆయన తెలిపారు.

# సామాన్యుడిపై ధరల భారం.. ప్రభుత్వం నిద్రమత్తులో ఉందా?

నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతూ సామాన్య పౌరుడి నడ్డి విరుస్తుంటే, వాటిని అదుపు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావు విమర్శించారు. సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ వేదికగా ప్రభుత్వంపై విరుచుకుపడిన ఆయన, పౌరసరఫరాల శాఖ పర్యవేక్షణా రాహిత్యానికి సామాన్య ప్రజలే మూల్యం చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే సన్నబియ్యం ధరలు ఏకంగా 25 శాతం పెరగడం ప్రభుత్వ వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. రికార్డు స్థాయిలో పంట దిగుబడి సాధించామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, ఉత్పత్తి పెరిగినప్పుడు మార్కెట్లో బియ్యం ధరలు ఎందుకు ఆకాశాన్ని అంటుతున్నాయో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రభుత్వం రేషన్ ద్వారా ఇస్తున్న నాణ్యత లేని సన్నబియ్యాన్ని ప్రజలు వినియోగించడం లేదనడానికి, బయట మార్కెట్లో బియ్యం ధరలు అదుపు తప్పడమే ప్రధాన సాక్ష్యమని వ్యాఖ్యానించారు. ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్నకు మద్దతు ధర పేరిట నామమాత్రపు ధర మాత్రమే దక్కుతుంటే, మధ్యదళారులు మాత్రం క్వింటాకు రూ.8,000 పైమాటే లాభపడుతున్నారని హరీష్ రావు ఆరోపించారు. రైతుకు గిట్టుబాటు ధర దక్కక, ఇటు వినియోగదారుడికి అందుబాటు ధరలో సరుకులు అందక తీవ్ర అవస్థలు పడుతుంటే కేవలం మధ్యవర్తులు మాత్రమే కోట్లు కొల్లగొడుతున్నారని ధ్వజమెత్తారు. కళ్లముందే ఈ దోపిడీ జరుగుతున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమన్నారు.

# ఏదుల నుంచే డిండికి నీళ్లు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించినట్లు చర్చ జరుగుతోంది. కాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో మంత్రి ఉత్తమ్‌తో కలిసి ఈ అంశంపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. కాగా ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల వివరాలను ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించలేదు. ఏదుల రిజర్వాయర్‌లో కనీసం 437.375 మీటర్ల నీటి మట్టం ఉంటేనే పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా వీరాంజనేయ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీటిని తరలించాలని ఆ తర్వాత నిర్ణయించారు. ఏదుల జలాశయ గరిష్ట నీటినిల్వ మట్టం (ఎఫ్ఆర్ఎల్) 445 మీటర్లు కాగా, గరిష్ట నిల్వ సామర్థ్యం 6.59 టీఎంసీలు. జలాశయంలో 440 మీటర్ల మట్టంతో 4.16 టీఎంసీలు, 437 మీటర్ల మట్టంతో 3.04 టీఎంసీలు, 436 మీటర్ల మట్టంతో 2.72 టీఎంసీల నిల్వలు ఉంటాయి. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించడానికి నిర్మిస్తున్న కాల్వ అడుగు (బెడ్ లెవల్) 21.643 కి.మీ.ల వద్ద 421.45 మీటర్ల మట్టాన్ని కలిగి ఉండగా, తొలి ప్రతిపాదనల ప్రకారం ఏదులలో 436.41 మీటర్ల మట్టం నుంచి నీటిని తరలించాల్సి ఉంది. డిండి ఎత్తిపోతలకు నీటిని తరలించడానికి ఏదుల రిజర్వాయర్‌లో ఉండాల్సిన నీటిమట్టం, డిండి ప్రాజెక్టు కాల్వ లోతు మధ్య 4.9 మీటర్ల వ్యత్యాసం ఉంది. ఈ నేపథ్యంలో డిండి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని తరలించడానికి ఏదుల రిజర్వాయర్‌లో ఉండాల్సిన కనీస నిల్వ మట్టాన్ని 440 మీటర్లకు పెంచాలని గతంలో ఈఎన్సీ (జనరల్) నేతృత్వంలోని ఓ కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది.ఏదుల రిజర్వాయర్‌ను 440 మీటర్లకు నింపడానికి కేవలం 2 రోజులే పడుతుందని, దీని వల్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేసింది.

# రేవంత్ రెడ్డి సర్కార్ మరో అడుగు..

నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. మొదటి దశలో 67 పాఠశాలల నిర్మాణాలను డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ తర్వాత జూన్ 2028 నాటికి ఈ సంఖ్యను 87కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దశలవారీగా ఈ విద్యా సంస్థలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం సుమారు 26 ఎకరాల విస్తీర్ణంలో ప్రాంగణాన్ని అభివృద్ధి చేయనున్నారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, క్రీడా మైదానాలు, వసతి గృహాలు, సిబ్బంది క్వార్టర్లు, ఆధునిక వంటశాలలు వంటి సౌకర్యాలు ఇందులో భాగంగా ఉంటాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని పాఠశాలలను ఒకే ప్రాంగణంలోకి తీసుకురావడం ద్వారా సమగ్ర విద్యా వాతావరణాన్ని కల్పించనున్నారు. నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించాలని, నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని సీఎస్ అధికారులకు స్పష్టం చేశారు. భూమి, టెండర్లకు సంబంధించిన పెండింగ్ అంశాలను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. మరోవైపు ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థలను ఏర్పాటు చేసే అంశంపైనా సమావేశంలో చర్చించారు. యూనివర్సిటీ ఆఫ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్‌తో పాటు మరో నాలుగు విదేశీ విశ్వవిద్యాలయాలు క్యాంపస్‌ల ఏర్పాటుపై ఆసక్తి చూపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. వీటి కోసం మౌలిక వసతులు, పెట్టుబడులు, అనుమతులు, విద్యా కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన సమగ్ర విధానాన్ని రూపొందించాలని సంజయ్ జాజు సూచించారు.తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ చర్యలను ముందుకు తీసుకెళ్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. యంగ్ ఇండియా స్కూళ్ల నిర్మాణంతో ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఆధునిక సదుపాయాలను విస్తరించడంతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంపై దృష్టి పెట్టింది.

# తెలంగాణలో ఓట్ల లెక్కపై దుమారం..

ఢిల్లీ, అక్టోబరు 5: తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ రాజకీయంగా మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ తన తదుపరి కార్యాచరణను ఖరారు చేసింది. సర్ సందర్భంగా రాష్ట్రంలో సుమారు 90 లక్షల ఓట్లను తొలగించారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఢిల్లీలో సోమవారం కాంగ్రెస్ అగ్రనేతల సమక్షంలో జరిగిన సమావేశంలో సర్ కు సంబంధించిన అంశాలపై చర్చ జరిగినట్లు ఆయన తెలిపారు. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ అధ్యక్షతన ఈ భేటీ జరిగినట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు నిరసన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించబడ్డాయని భావిస్తున్న వారికి సహకారం అందించే దిశగా తెలంగాణలోని వివిధ ప్రజా సంస్థలు, ఎన్జీవోలు, కుల సంఘాలను సంప్రదించనున్నట్లు మహేశ్ గౌడ్ తెలిపారు. అర్హత ఉన్న ప్రతి వ్యక్తి తన ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితి ఉండాలని కాంగ్రెస్ అభిప్రాయపడుతోందన్నారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై కూడా ఆయన విమర్శలు చేశారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒత్తిడి కారణంగానే ఎన్నికల కమిషన్ ఈ విధంగా వ్యవహరిస్తోందని మహేశ్ గౌడ్ ఆరోపించారు. ఈ అంశాన్ని రాష్ట్రవ్యాప్తంగా తీసుకెళ్లేందుకు అక్టోబర్ 6, 7 తేదీల్లో వివిధ స్థాయిల్లో ధర్నాలు, ర్యాలీలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. అనంతరం అక్టోబర్ 8న లోక్‌భవన్ ఎదుట నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. రాబోయే రెండు నెలల పాటు సర్ అంశంపై వరుస కార్యక్రమాలు కొనసాగిస్తామని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

# సింగరేణి కార్మికుల కోసం కవిత పోరుబాట..

హైదరాబాద్, అక్టోబరు 5: సింగరేణి కార్మికుల సమస్యలు మరోసారి రాజకీయ వేదికపైకి వచ్చాయి. ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు అంశాల పరిష్కారం కోసం తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నేతృత్వంలో సోమవారం హైదరాబాద్‌లో నిరసన చేపట్టారు. సింగరేణి భవన్‌ను ముట్టడించేందుకు కార్యకర్తలు ప్రయత్నించారు. కార్మికులకు సంస్థ ఆర్జించే లాభాల్లో 35 శాతం వాటా అందించాలని కవిత కోరారు. వైద్య కారణాలతో ఉద్యోగానికి అనర్హత కోసం మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ప్రతి నెలా రెండు పర్యాయాలు వైద్య బోర్డులు నిర్వహించే విధానం తీసుకురావాలని ఆమె సూచించారు. అలియాస్ పేర్లకు సంబంధించిన సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించిన అంశాలను కూడా కవిత ప్రస్తావించారు.

# ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు..

తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక పాలసీ రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే యూనివర్సిటీ ఆఫ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్‌తో పాటు మరో నాలుగు అంతర్జాతీయ యూనివర్సిటీలు ఫ్యూచర్ సిటీలో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపినట్లు అధికారులు సీఎస్‌కు తెలిపారు. విదేశీ వర్సిటీలను ఆహ్వానించడం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, పెట్టుబడులకు అవకాశం కల్పించడం, అనుమతులు సులభతరం చేయడం, విద్యా కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలను పాలసీలో చేర్చాలని సంజయ్ జాజు సూచించారు. తెలంగాణ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతిపాదిత వర్సిటీల ప్రతినిధులతో చర్చలు జరిపి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నాటికి ఈ ప్రణాళిక సిద్ధంగా ఉండాలని సూచించారు.

# 5 నిమిషాల్లో రూ. 2 కోట్ల బంగారం లూటీ!

హైదరాబాద్ శివారులోని మేడిపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. వరంగల్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఓ జ్యువెలరీ దుకాణాన్ని అంతర్రాష్ట్ర దొంగల ముఠా కొల్లగొట్టి కేవలం 5 నిమిషాల్లో ఏకంగా రూ. 2 కోట్ల విలువజేసే 1.4 కిలోల బంగారు, వజ్రాభరణాలతో పరారైంది. పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ చోరీ జరగడం గమనార్హం. సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను అధ్యయనం చేసిన పోలీసులు దుకాణం షెట్టర్ రోడ్డుపై ఉన్న వారికి కనిపించకుండా తెల్లని వస్త్రం అడ్డుపెట్టి దొంగలు ఈ నేరం చేసినట్లు తేల్చారు. రాజస్తాన్‌కు చెందిన ఏడుగురు ఈ చోరీకి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. హనుమకొండకు చెందిన వెలిశెట్టి సుబ్రహ్మణ్యం టాటా కంపెనీకి చెందిన క్యారెట్‌లేన్ జ్యువెలరీ దుకాణాల ఫ్రాంచైజీ కలిగి ఉన్నారు. హనుమకొండలో ఒకటి, మేడిపల్లి బుద్ధనగర్‌లో మరొకటి నిర్వహిస్తున్నారు. అయితే ఈ జ్యువెలరీ ఫ్రాంచైజీకి కాపలాగా సెక్యూరిటీ గార్డు లేకపోవడంతో దొంగలు దీన్ని టార్గెట్ చేశారు.



# మమ్మల్ని ఎవరూ పెళ్లి చేసుకోవడం లేదు సార్!

కర్ణాటకలో ఓ యువరైతు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు చేసిన ఓ విజ్ఞప్తి ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గ్రామాల్లో యువ రైతులకు పెళ్లిళ్లు కావడం లేదని, ఈ తీవ్రమైన సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన కోరడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ సంభాషణకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మైసూరు జిల్లాలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న ఓ యువరైతు, తమ గోడును నేరుగా డీకే శివకుమార్ ముందుంచారు. “గ్రామాల్లో యువకులకు సొంత ఇళ్లు, పొలాలు ఉండి, కష్టపడి పనిచేస్తున్నా పెళ్లిళ్లు కావడం లేదు. అమ్మాయిలు, వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగులు, ఎక్కువ జీతం వచ్చే వారినే కోరుకుంటున్నారు. దీంతో 30, 40 ఏళ్లు దాటినా చాలా మంది బ్రహ్మచారులుగానే మిగిలిపోతున్నారు. ఈ మానసిక వేదనతో కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు గ్యారంటీలు ఇచ్చినట్లే, మా పెళ్లిళ్ల సమస్యను ఆరో గ్యారంటీగా భావించి పరిష్కరించాలి” అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యువరైతు వినతికి డీకే శివకుమార్ మొదట ఆశ్చర్యపోయినా, ఆ తర్వాత అతడు చెప్పేది శ్రద్ధగా విన్నారు. సభలో కొందరు నవ్వడంతో, ఇది నవ్వుకోవాల్సిన విషయం కాదని, తీవ్రమైన సామాజిక సమస్య అని వారికి సూచించారు. మారుతున్న సామాజిక ప్రాధాన్యతలు, పట్టణ జీవనశైలి ప్రభావం, ఉద్యోగాల స్వరూపం వంటివి వివాహ నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వీడియో వైరల్ కావడంతో, వ్యవసాయంపై యువతలో తగ్గుతున్న ఆసక్తి, గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు వంటి అంశాలపై విస్తృత చర్చ జరుగుతోంది. మంచి ఆస్తులున్న భూస్వాములకు కూడా ఇలాంటి ఇబ్బందులు తప్పడం లేదని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

# రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం” అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన ‘అమరజీవి జలధార’ పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు.ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. “ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన ‘హర్ ఘర్ జల్ - జలజీవన్ మిషన్’కు 2019-24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు” అని దుయ్యబట్టారు. 2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. “గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష” అని పవన్ పేర్కొన్నారు. తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. “దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం” అని ఉద్ఘాటించారు. గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. “రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం” అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# రామప్పకు మైనింగ్ ముప్పు.. కేటీఆర్ సంచలన హెచ్చరిక

**రామప్ప చుట్టూ మైనింగ్ వివాదం.. కేటీఆర్ కీలక డిమాండ్**

**ములుగు జిల్లాలో ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుపై కేటీఆర్ స్పందన**

**ఆలయం సమీపంలో తవ్వకాలు, బ్లాస్టింగ్‌పై అభ్యంతరం**

**రామప్ప దేవాలయం, చెరువు భద్రతపై ఆందోళన వ్యక్తం చేసిన బీఆర్ఎస్ నేత**

**ప్రాజెక్టును రద్దు చేయకుంటే భారీ స్థాయి ఆందోళనకు దిగుతామని ప్రకటన**



హైదరాబాద్, అక్టోబరు 5: ఒకవైపు బొగ్గు ఉత్పత్తి అవసరాలు.. మరోవైపు చారిత్రక వారసత్వాన్ని రక్షించాల్సిన బాధ్యత. ఈ రెండింటి మధ్య రామప్ప ప్రాంతంలో మైనింగ్ ప్రతిపాదన ఇప్పుడు రాజకీయ చర్చకు దారితీసింది. ములుగు జిల్లాలో రామప్ప దేవాలయానికి సమీపంగా ఓపెన్‌కాస్ట్ బొగ్గు గని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యతిరేకించారు. రామప్ప పరిసరాల్లో లోతైన తవ్వకాలు జరపడంతో పాటు పేలుళ్లు చేపడితే పురాతన ఆలయ నిర్మాణంపై ప్రతికూల ప్రభావం ఉండొచ్చని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ హోదా పొందిన ఈ కట్టడాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అదే సమయంలో రామప్ప చెరువు పరిస్థితిపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మైనింగ్ కార్యకలాపాల కారణంగా ఆలయానికి, చెరువుకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని కేటీఆర్ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. వారసత్వ ప్రాంతాన్ని దెబ్బతీసే ఏ చర్యనైనా బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుందని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కూడా కేటీఆర్ విమర్శలు చేశారు. భూముల్లోని ఖనిజ సంపద వెలికితీతకు ప్రాధాన్యం ఇస్తూ చారిత్రక కట్టడాల పరిరక్షణను విస్మరిస్తున్నారని ఆయన ఆరోపించారు. రామప్పను ప్రభావితం చేసే ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లొద్దని ప్రభుత్వాన్ని కోరారు.ప్రతిపాదిత గనిపై ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. మరోవైపు, రామప్పకు మైనింగ్ వల్ల ముప్పు లేదనే ప్రచారంపై సింగరేణి స్పష్టత ఇస్తూ, సమగ్ర శాస్త్రీయ అధ్యయనాల తర్వాతే ప్రాజెక్టుపై నిర్ణయం ఉంటుందని తెలిపింది.

# కూకట్‌పల్లిలో ట్రాఫిక్ నరకం..

**అరగంట దారి గంటన్నర అవుతోంది!**

**కేపీఎల్ బార్ నుంచి జగద్గిరిగుట్ట లాస్ట్ బస్ స్టాప్ వరకు వాహనాల రద్దీ**

**నాగార్జున స్కూల్ నుంచి వడ్డేపల్లి ఎంక్లేవ్, రెబల్ వైన్స్ వరకు ఇదే పరిస్థితి**

**రోడ్లు ఇరుకుగా ఉండటంతో పాటు రోడ్లపైనే వాహనాల పార్కింగ్**

**సిగ్నల్స్, ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు**







కూకట్‌పల్లి, అక్టోబర్ 5: ఇంటి నుంచి బయలుదేరినప్పుడు అరగంటలో గమ్యస్థానానికి చేరుకోవచ్చని అనుకుంటారు. కానీ కూకట్‌పల్లిలోని కొన్ని ప్రధాన మార్గాల్లో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. కొద్ది కిలోమీటర్ల దూరం వెళ్లేందుకు గంటకుపైగా సమయం పడుతుండటంతో వాహనదారుల సహనం నశిస్తోంది. ఉదయం స్కూల్ సమయం, సాయంత్రం ఆఫీసులు ముగిసే వేళల్లో రోడ్లపై వాహనాలు కదలడమే కష్టంగా మారుతోంది. ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాల వరుసలు.. హారన్‌ల మోత.. ముందుకు కదలని వాహనాలు.. వెరసి స్థానికులకు రోజువారీ ప్రయాణం ఇబ్బందిగా మారింది.

**కేపీఎల్ బార్ నుంచి లాస్ట్ బస్ స్టాప్ వరకు..**

కేపీఎల్ బార్ నుంచి జగద్గిరిగుట్ట లాస్ట్ బస్ స్టాప్ వరకు ఉన్న మార్గంలో నిత్యం భారీగా వాహనాలు నిలిచిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇదే సమయంలో నాగార్జున స్కూల్ నుంచి వడ్డేపల్లి ఎంక్లేవ్, రెబల్ వైన్స్ వైపు వెళ్లే రహదారిలోనూ రద్దీ తీవ్రంగా ఉంటోందని పేర్కొంటున్నారు. ఉదయం విద్యార్థులు, ఉద్యోగులు ఒకేసారి రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్ ఒత్తిడి పెరుగుతోంది. సాయంత్రం పాఠశాలలు, కార్యాలయాలు ముగిసిన తర్వాత పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు.

**స్కూల్ బస్సుల నుంచి అంబులెన్స్ వరకు..**

ఈ మార్గంలో పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, బార్లు, వైన్ షాపులు ఉండటంతో వివిధ రకాల వాహనాలు ఒకేసారి రోడ్డుపైకి వస్తున్నాయి. ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లు, స్కూల్ బస్సులతో రహదారులు నిండిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ట్రాఫిక్ తీవ్రంగా నిలిచిపోయిన సమయంలో అత్యవసర వాహనాలు సైతం వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆసుపత్రులకు వెళ్లే అంబులెన్స్‌లు ట్రాఫిక్‌లో చిక్కుకుంటే పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతుందని అంటున్నారు.

**సమస్యకు కారణాలేంటి?**

స్థానికుల అభిప్రాయం ప్రకారం.. ఈ ప్రాంతంలో రహదారులు ఇరుకుగా ఉండటం, పలు చోట్ల ఆక్రమణలు ఉండటం ప్రధాన సమస్యల్లో ఒకటి. దీనికి తోడు ముఖ్యమైన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడం వల్ల వాహనాల కదలికకు సరైన నియంత్రణ లేకుండా పోతోందని చెబుతున్నారు. మరోవైపు బార్లు, వైన్ షాపుల పరిసరాల్లో వాహనాలను రోడ్డుపైనే నిలిపివేయడం కూడా ట్రాఫిక్ రద్దీకి కారణమవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ, నియంత్రణ మరింత పెంచాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

**"అరగంట ప్రయాణం.. గంటన్నర పడుతోంది"**

రోజువారీ ప్రయాణంలో ఎదురవుతున్న ఇబ్బందులను స్థానికులు తీవ్రంగా వివరిస్తున్నారు. సాధారణంగా అరగంటలో పూర్తయ్యే ప్రయాణం ట్రాఫిక్ కారణంగా గంటన్నర వరకు సాగుతోందని చెబుతున్నారు. పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్లే సమయంలో రద్దీ మరింత ఎక్కువగా ఉంటోందని, అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాలన్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సాయంత్రం సమయంలో తీసిన దృశ్యాల్లోనూ రహదారిపై పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయిన పరిస్థితి కనిపించిందని స్థానికులు చెబుతున్నారు.

**శాశ్వత పరిష్కారం కావాలంటున్న ప్రజలు**

ట్రాఫిక్ సమస్యను తాత్కాలికంగా కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. అవసరమైన చోట రోడ్లను విస్తరించడం, ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడం, రోడ్లపై వాహనాల పార్కింగ్‌ను నియంత్రించడం వంటి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో ట్రాఫిక్ సిబ్బందిని అందుబాటులో ఉంచి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణించే ఈ మార్గాల్లో ట్రాఫిక్ సమస్యకు అధికారులు ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కేబీఆర్ పార్క్ చుట్టూ ఇక శాశ్వత వన్‌వే.. రూ.400 కోట్లు ఆదా!

- వన్‌వే విధానాన్ని ఇక నిరంతరంగా కొనసాగించనున్న జీహెచ్‌ఎంసీ
- రద్దీ తగ్గడంతో గత ప్రతిపాదనల్లో పలు మార్పులు
- నాగార్జున సర్కిల్ నుంచి చెక్‌పోస్ట్ వరకు ఆరు లేన్ల స్టీల్ బ్రిడ్జి
- సవరించిన పనులతో సుమారు రూ.400 కోట్ల వ్యయం తగ్గింపు



హైదరాబాద్, అక్టోబర్ 5: కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి జీహెచ్‌ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అమలులో ఉన్న వన్‌వే రాకపోకల విధానాన్ని ఇకపై శాశ్వతంగా కొనసాగించాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా గతంలో రూపొందించిన హెచ్-సిటీ మౌలిక వసతుల ప్రతిపాదనల్లో మార్పులు చేసింది. ఫలితంగా సుమారు రూ.400 కోట్ల మేర ఖర్చు తగ్గనుంది.

**క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత ప్రకటన**

కేబీఆర్ పార్క్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ పరిసరాలను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సోమవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వన్‌వే రూట్‌తో పాటు ఫ్రీ లెఫ్ట్ సదుపాయాలు వాహనాల వేగవంతమైన రాకపోకలకు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఈ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత ట్రాఫిక్ ఏర్పాటును కొనసాగించనున్నట్లు చెప్పారు.

**రెండు ప్రధాన నిర్మాణాలకు ప్రాధాన్యం**

సవరించిన ప్రాజెక్టులో నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు ఆరు లేన్ల స్టీల్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. ఏడాది లోపే పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కేబీఆర్ పార్క్ సమీపంలో ఒక అండర్‌పాస్ నిర్మాణానికి కూడా ప్రణాళిక సిద్ధం చేశారు.

**పాత ప్రతిపాదనలకు కోత**

హెచ్-సిటీ కింద కేబీఆర్ పార్క్ చుట్టూ పలు స్థాయిల్లో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించేందుకు గతంలో రూ.1,090 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు రూపొందించారు. అయితే ప్రస్తుత వన్‌వే విధానం ద్వారా ట్రాఫిక్ నియంత్రణలో సానుకూల ఫలితాలు రావడంతో ఆ ప్రణాళికలను అధికారులు మళ్లీ సమీక్షించారు. దీనికి తోడు కోర్టు కేసులు వంటి అంశాలు కూడా పునరాలోచనకు కారణమయ్యాయి.

**ప్రజాధనంపై దృష్టి**

కొత్త నిర్ణయం ప్రకారం ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో మాత్రమే పెద్ద నిర్మాణాలను చేపట్టనున్నారు. అవసరం లేని ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లను తొలగించడం ద్వారా వ్యయం తగ్గించనున్నారు. ఈ మార్పుల వల్ల దాదాపు రూ.400 కోట్లు ఆదా అయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అదే సమయంలో కేబీఆర్ పార్క్ పరిసరాల్లో వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు అవసరమైన మౌలిక వసతులను మాత్రం ఏర్పాటు చేయనున్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాల విమర్శలు...

**బీజేపీ చీఫ్ రామచందర్ రావు కౌంటర్**

**ఓటర్ల జాబితా సవరణ ఈసీ ప్రక్రియేనన్న రామచందర్ రావు**

**దొంగ ఓటర్లను, చనిపోయిన ఓటర్లను తొలగించడమే లక్ష్యమని వ్యాఖ్య**

**ఓవైసీ, కాంగ్రెస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయన్న రామచందర్ రావు**

**ఓడిపోయినప్పుడల్లా ఈసీ, ఈవీఎంలపై నిందలు వేస్తారని విమర్శలు**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియపై ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. ఇది బీజేపీ చేస్తున్న కార్యక్రమం కాదని, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) చేపట్టిన ప్రక్రియ అని స్పష్టం చేశారు. దొంగ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించడమే దీని ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు.సోమవారం ఆయన మాట్లాడుతూ, "ఈ ప్రక్రియను బీజేపీ ప్రవేశపెట్టలేదు, ఇది ఎన్నికల సంఘం చేపట్టిన ప్రక్రియ అని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, ఇతర నేతలు తెలుసుకోవాలి. కాంగ్రెస్ హయాంలో కూడా ఇది జరిగింది. అప్పుడు వ్యతిరేకించని వారు ఇప్పుడు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?" అని ప్రశ్నించారు. కేరళలో ఎస్ఐఆర్ తర్వాత కాంగ్రెస్ గెలిచినా, దానికి వారి వద్ద సమాధానం లేదని ఎద్దేవా చేశారు. "కాంగ్రెస్ లేదా ఇండియా కూటమి ఎన్నికల్లో ఓడిపోయినప్పుడల్లా ఈసీపై లేదా ఈవీఎంలపై నిందలు వేయడం అలవాటుగా మారింది. గత 12 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉండటంతో ఓవైసీ, కాంగ్రెస్ పార్టీలు విరక్తితో ఉన్నాయి.

# హైదరాబాదు లబ్ధిదారులకు అల్టిమేటం..

**9లోగా రూ.లక్ష కట్టకపోతే ఇందిరమ్మ ఇల్లు రద్దు!**

**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం తుది హెచ్చరిక**

**అక్టోబరు 9 లోగా లక్ష రూపాయలు చెల్లించాలని ఆదేశం**

**గడువు దాటితే ప్రొవిజినల్ అలాట్‌మెంట్ రద్దు చేస్తామని స్పష్టీకరణ**

**ఇప్పటికే 59 శాతం మంది లబ్ధిదారుల చెల్లింపులు పూర్తి**

**ఖాళీ అయ్యే ఇళ్లు వెయిటింగ్ లిస్టులో ఉన్నవారికి కేటాయింపు**



హైదరాబాద్ నగరంలో క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల టవర్ల లబ్ధిదారులకు తెలంగాణ హౌసింగ్ బోర్డు కీలక ప్రకటన చేసింది. లబ్ధిదారులు తమ వాటాగా చెల్లించాల్సిన లక్ష రూపాయల మొత్తానికి అక్టోబరు 9వ తేదీని తుది గడువుగా నిర్ణయించింది. ఈ గడువులోగా డబ్బు చెల్లించని వారి ప్రొవిజినల్ అలాట్‌మెంట్ లెటర్లను ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే రద్దు చేస్తామని స్పష్టం చేసింది.తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్, హౌసింగ్ కమిషనర్ వి.పి.గౌతమ్ ఆదివారం ఈ వివరాలు వెల్లడించారు. క్యూర్ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 5,501 మందికి ప్రొవిజినల్ అలాట్‌మెంట్ లెటర్లు జారీ చేయగా, ఇప్పటివరకు 3,271 మంది (దాదాపు 59.46 శాతం) మాత్రమే తమ చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులు కూడా వెంటనే స్పందించి, గడువులోగా ఆన్‌లైన్‌లో చెల్లింపులు పూర్తి చేయాలని ఆయన కోరారు.అక్టోబరు 9 తర్వాత గడువును పొడిగించే ప్రసక్తే లేదని కమిషనర్ గౌతమ్ తేల్చిచెప్పారు. గడువులోగా చెల్లించడంలో విఫలమైన వారి కేటాయింపులను రద్దు చేసి, ఆ ఖాళీలను వెయిటింగ్ లిస్టులో ఉన్న సుమారు 35 వేల మంది అర్హులైన దరఖాస్తుదారులకు కేటాయిస్తామన్నారు. రాబోయే నెలల్లో లాటరీ పద్ధతిలో ఈ కేటాయింపులు ఉంటాయని ఆయన వివరించారు.అయితే, ప్రభుత్వం ఆన్‌లైన్‌లో డబ్బు చెల్లించాలని చెబుతుండటంతో, ఆ పద్ధతి తెలియని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పథకం, కేటాయింపు, చెల్లింపులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం లబ్ధిదారులు తెలంగాణ హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ TGHB.telangana.gov.iను సందర్శించాలని లేదా హౌసింగ్ బోర్డు కాల్ సెంటర్ 040-24603572లో సంప్రదించాలని అధికారులు సూచించారు. కేటాయింపుదారులకు వారి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు ౧+ఎదీూా పేరుతో ూమీూ, వాట్సాప్ ద్వారా కూడా సమాచారం పంపుతున్నట్లు వారు తెలిపారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# లైంగిక దాడికి తక్కువేం కాదు...

## ఏఐ వీడియోపై జాన్వీకపూర్ రియాక్షన్ ఇదే..!



దేవర సినిమాలోని సూపర్‌హిట్ సాంగ్ 'చుట్టమల్లే' పై సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఏఐ మార్ఫింగ్ వీడియో ఇండస్ట్రీలో టాక్ ఆఫ్‌ది టౌన్‌గా మారిన విషయం తెలిసిందే. ఈ సాంగ్‌లో జాన్వీ కపూర్ కనిపించిన సన్నివేశాలను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని ఉపయోగించి అత్యంత అసభ్యకరంగా మార్ఫింగ్ చేయడం పట్ల తారక్‌తోపాటు పలువురు సెలబ్రిటీలు తీవ్ర ఆగ్రహం చేస్తున్నారు. టెక్నాలజీని ఉపయోగించి మహిళలను అభ్యంతరకర రీతిలో వారి ప్రమేయం, అనుమతి లేకుండా ఫిక్షనల్ కంటెంట్‌ను వ్యాప్తి చేయడం తీవ్రమైన ఉలంఘన, లైంగిక దాడికి సమానమైన చర్యగా అభిప్రాయపడ్డది. వ్యక్తిగత హద్దులను ఎప్పుడూ గౌరవించాలన్నది. ఒక మహిళ ఏం ధరించినా లేదా ఆమె ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా సరే.. అంటే ఆమె వరుసగా 5 రోజులు అవునని చెప్పి, ఆరో రోజు కాదని చెప్పినా.. ఆ కాదని చెప్పిన విషయాన్ని గౌరవించాలంది. తాను ఎదుర్కొంటున్న ఏఐ వీడియోలకే ఈ సమస్య పరిమితం కాదని, మహిళలు ప్రతీ రోజూ ఎదుర్కొంటున్న విమర్శలు, భద్రతకు సంబంధించిన ఆందోళనలాంటి వాస్తవ పరిస్థితిని ప్రతిబింబిస్తుందని పేర్కొంది. ఏఐ వీడియో విషయంలో సీరియస్‌గా స్పందించడం పట్ల జాన్వీకపూర్ జూనియర్ ఎన్టీఆర్ కు కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ వ్యవహారానికి వ్యతిరేకంగా గళం విప్పిన చిరంజీవి, విజయ్ ఖుష్బులను అభినందించిన జాన్వీకపూర్.. " ఆమె శరీరం.. ఆమె ప్రతిబింబం, ఆమె హద్దులు.. ఆమె చాయిస్.." అంటూ తన స్టేట్‌మెంట్‌ను ముగించింది. ఈ క్రమంలో జాన్వీ కపూర్ AI వీడియోపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నమోదు చేశారు. ఏఐ మార్ఫింగ్ వీడియోల వెనుకున్నదెవరు, ఎక్కడి నుంచి వచ్చాయనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు సమాచారం.



# ఓ వైపు శాంతం మరోవైపు రౌద్రం

ప్రస్తుతం సాయిపల్లవికి మహర్దశ నడుస్తున్నది. ఒక కథానాయికగా దేశవ్యాప్తంగా తిరుగులేని గుర్తింపు రావడం అరుదైన విషయం. అన్ని భాషలకు చెందిన ప్రేక్షకులూ తమ హీరోయిన్‌గా ఓన్ చేసుకోవడం ఈ మధ్య సాయిపల్లవి విషయంలోనే జరిగిందని చెప్పక తప్పదు. వచ్చే నెలలో రెండు వారాల తేడాతో ఆమె సినిమాలు రాబోతున్నాయి. వాటిలో మొదటిది నితీష్ తివారీ 'రామాయణ: పార్ట్ 1'. ఈ పాన్ ఇండియా పౌరాణిక దృశ్యకావ్యంలో సాయిపల్లవి సీతామహాసాధ్విగా కనిపించనున్నారు. సరిగ్గా ఈ సినిమా విడుదలైన రెండు వారాలకు, అంటే.. నవంబర్ 20న ధనుష్ హీరోగా రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఓం: చాప్టర్ 1' విడుదల కానున్నది. ఇందులో సాయిపల్లవిది కీలకమైన పాత్ర. యాక్షన్, ఎమోషన్స్‌తో ఆమె పాత్ర సాగుతుందని సమాచారం. రెండు వారాల గ్యాప్‌తో రెండు పొంతన లేని పాత్రల ద్వారా ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని సాయిపల్లవి పంచనున్నదని సినీవర్గాలు అంటున్నాయి. ఈ ప్రయత్నాలు రెండూ ఫలిస్తే.. సాయిపల్లవి క్రేజ్ దేశవ్యాప్తంగా మరింత పెరగడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



# యథార్థ సంఘటన ఆధారంగా 'మొహబ్బత్'

సంతోష్‌రాజా, శ్రేయాస్ సేన్ జంటగా నటిస్తున్న ప్రేమకథాచిత్రం 'మొహబ్బత్'. మ్యాక్ దర్శకత్వంలో అఫ్రోజ్ షేక్ నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానున్నది. ఈ చిత్రం టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. హీరో నవదీప్, దర్శకుడు కరుణకుమార్ ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. కొత్త విషయం చెప్పాలన్న తాపత్రయంతో చేసిన సినిమా ఇదని దర్శకుడు మ్యాక్ తెలిపారు. కథపై నమ్మకంతోనే ఈ సినిమాను నిర్మించామని నిర్మాత అఫ్రోజ్ షేక్ చెప్పారు. కడపలో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా తీసిన ఎమోషనల్ లవ్‌స్టోరీ ఇదని హీరో సంతోష్ పేర్కొన్నారు. ఈ సినిమాలో భాగం కావడం పట్ల హీరోయిన్ శ్రేయాస్ సేన్ ఆనందం వెలిబుచ్చారు.

# అమాయకుల అంతరిక్ష ప్రయాణం



'రాజు వెడ్స్ రాంబాయి' తర్వాత వేణు ఊడుగుల సమర్పణలో వస్తున్న చిత్రం 'చంద్రయాన్'. శివకుమార్ ధీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్, లోకేష్, బలగం సత్యనారాయణ కీలక పాత్రలు పోషిస్తున్న ఈచిత్రానికి శ్రీనాథ్ చంద్రశేఖర్ దర్శకుడు. ప్రవీణ్ మొలక నిర్మాత. ఈ నెల 30న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ప్రముఖ జ్యోతీష్యుడు వేణు స్వామి ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. 'ఇది రెగ్యులర్ రొటీన్ సినిమా కాదు. అర్థవంతమైన సినిమా. అమాయకులైన నలుగురు యువకులు రాకెట్ తయారు చేసుకుని స్పేస్‌లోకి వెళ్లడం అనే పాయింట్ ఇంట్రస్టింగ్‌గా అనిపించింది. ఈ ప్రయాణంలో వాళ్లు ఎదుర్కొన్న ఇబ్బందులు, తెలుసుకున్న విషయాలను దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించాడు. ప్రేక్షకులకు కొత్త ఫీల్‌ని కలిగించే సినిమా ఇది' అని చిత్ర సమర్పకుడు వేణు ఊడుగుల అన్నారు. అమాయకులు, ధైర్యవంతులూ అయిన నలుగురు కుర్రాళ్ల కథ ఇదని దర్శకుడు శ్రీనాథ్ చంద్రశేఖర్ తెలిపారు. ఇంకా చిత్ర బృందమంతా మాట్లాడారు.

# బిగ్‌బాస్ జోలికి వెళ్లేది లేదు..

## బిగ్‌బాస్ జోలికి వెళ్లేది లేదు.. మరోసారి హోస్ట్‌గా కనిపించనంటూ క్లారిటీ!



తెలుగు బుల్లితెరపై అత్యంత పాపులర్ రియాలిటీ షోలలో బిగ్‌బాస్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ప్రతి సీజన్‌లోనూ కంటెస్టెంట్ల ఆటతీరు, గొడవలు, ఎలిమినేషన్లు, వీకెండ్ ఎపిసోడ్స్ ఇలా ఏదో ఒక అంశం చర్చనీయాంశంగా మారుతూనే ఉంటుంది. అయితే ఈ షోతో అనుబంధం ఉన్న కొందరు సెలబ్రిటీల వ్యాఖ్యలు కూడా అప్పుడప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తుంటాయి. తాజాగా నేచురల్ స్టార్ నాని చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. తెలుగు బిగ్‌బాస్ తొలి సీజన్‌కు ఎన్టీఆర్ హోస్ట్‌గా వ్యవహరించగా.. రెండో సీజన్ బాధ్యతలను నాని చేపట్టారు. అప్పటికే హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాని.. తన సహజమైన శైలితో షోను నడిపించారు. కంటెస్టెంట్లతో నేరుగా మాట్లాడటం, వారి ఆటతీరుపై అభిప్రాయాలు చెప్పడం, తనదైన టైమింగ్‌తో ఎపిసోడ్స్‌ను రక్తికట్టించడం ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అయితే అదే సమయంలో నాని కొన్ని విమర్శలను కూడా ఎదుర్కొన్నారు. ముఖ్యంగా కొందరు కంటెస్టెంట్లకు నాని అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. కౌశల్ అభిమానుల నుంచి కూడా నానికి తీవ్ర స్థాయిలో ట్రోలింగ్ ఎదురైన విషయం అప్పట్లో హాట్‌టాపిక్‌గా మారింది. బిగ్‌బాస్ వంటి రియాలిటీ షోకు హోస్ట్‌గా వ్యవహరించడం సినిమాల్లో నటించడంతో పోలిస్తే పూర్తిగా భిన్నమైన అనుభవమని నాని గతంలోనే తెలుసుకున్నారు. ఒక సినిమాలో హీరో పాత్రకు ప్రేక్షకులు స్పందించే తీరు వేరు.. కానీ బిగ్‌బాస్‌లో హోస్ట్‌గా ఉన్నప్పుడు ప్రతి కంటెస్టెంట్ అభిమానుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఆ షో తనకు ఎన్నో విషయాలు నేర్పిందని తెలిపారు. అయితే ప్రస్తుతం తన పూర్తి దృష్టి సినిమాలపైనే ఉందని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. నటుడిగా ప్రేక్షకులను అలరించడమే తనకు ఎక్కువగా ఇష్టమని, రియాలిటీ షో హోస్టింగ్ మళ్లీ చేయడం తనకు అంతగా ఆసక్తి లేదనే సంకేతాలు ఇచ్చారు.నాని వ్యాఖ్యలను బట్టి చూస్తే.. భవిష్యత్తులో మరోసారి బిగ్‌బాస్ హోస్ట్‌గా కనిపించే అవకాశాలు తక్కువగానే ఉన్నట్లు అర్థమవుతోంది. బిగ్‌బాస్ సీజన్ 2లో హోస్ట్‌గా తనకు ఎదురైన అనుభవం, వచ్చిన ట్రోలింగ్ కూడా ఆయన నిర్ణయంపై ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. అయితే నాని హోస్టింగ్‌ను గుర్తు చేసుకుంటున్న బిగ్‌బాస్ అభిమానులు మాత్రం ఆయన మరోసారి షోలోకి రావాలని కోరుకుంటున్నారు. నాని తన సహజమైన శైలిలో సీజన్ 2ను నడిపించిన విధానం ఇప్పటికీ ప్రేక్షకులకు గుర్తుండిపోయింది. ప్రస్తుతం నాని చేసిన తాజా వ్యాఖ్యలు మరోసారి ఆ సీజన్ జ్ఞాపకాలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నాయి.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/